రివ్వున దూసుకొచ్చిన ఆటోను చూసి చిన్నపిల్లలా కేరింతలు కొడ్తూ ఆటో కడ్డం వచ్చింది అందులో కెక్కించమని అభినయిస్తూ పిచ్చి మంగి.

తల్లి గర్భంనుండి బయల్పడ్డ శిశువులాగే... వో కొత్త సృష్టిలాగే కన్పిస్తుం దెప్పుడూ వెంకటేశుకు మంగి. అలా యెందుకన్పిస్తుందో అతడికి తెల్సు. యే ఆలనా పాలనా లేక గాలిలో, నీటిలో, దుమ్ములో, ధూళిలో పెరిగిన వో ప్రాణిగా మంగి తెలుసతడికి. దాని వెఱ్ఱితనం, అమాయకత్వం అంతకన్నా బాగా తెల్సు. వొంట్లో వయసు తెచ్చిన మార్పులు మనసులో మార్పు తేలేకపోయాయి మంగిలో. అందుకే యే తల్లో యేక్షణంలోనో దయతల్చి కట్టబెట్టిన లుంగీ వంటి పాత చీరస్థానే చీర వుండక, పురి తీయబడ్డ శవంలా పైట నేలపై వ్రేలాడుతూ... నుడికట్టులోని గడి చెదిరిన అక్షరంలా చనుకట్టుపై ముడివీడిన మూరెడు రైక కొసలు విరబోసుకున్న ముందుకు పడ్డ ఆ నాలుగు రాగి తల వెంట్రుకలతో పోటీ పడ్తుంటాయి. ఎప్పుడూ బొట్టులేని దాని బోడి నుదురు గుడిలో లేని, పూజకు పోని శివలింగంలా కన్పించేది.

దాని ఆకృతి పూర్తిగా... మొండి కుంచెతో... అర్ధం తెలీని పిల్లాడు ఆడుకోను గీసిన తమాషా బొమ్మలాగే వుంటుంది.

తనకు వయసొచ్చిందని దానికి తెలీదు. ఆ చూసే వాళ్ళకన్నా కూడా తెలీదని అనుకుంటాడు వెంకటేశు.

గర్భస్థ శిశువులా కన్పించే ఆ అమాయకురాలు నవ్వితే ప్రకృతే పులకించినట్టు ఫీలవుతాడు. పసిపాపలా ఆ పిచ్చిముండని లాలిస్తాడు. దాని కళ్ళలోని ఆశ కనిపెట్టి మాటలు రాని ఆ మూగ మనసు కోర్కె తీరుస్తూ... అడిగిందల్లా కొనిపెడ్తాడు. ఆ పిచ్చిది అతడికేమవుతునదో మనలాగే అతడికీ తెలీదు.

కొత్తలో వొకనాటి మాట....

ఆ పిచ్చి దాని వొంటి నిండా గాయాలు...

పిచ్చికుక్కల్లా వెంటబడి రాళ్ళతో కొడ్తూ వెంటబడి తరుముతున్న మంచి మంచి వాళ్ళ పిల్లల్ని కళ్ళారా చూశాడు వెంకటేశు. అందర్నీ వెదరగొట్టాడు. ముళ్ళ కంచెలకూ, రాళ్ళకూ రప్పల కడ్డంపడి... కారుతున్న రక్తంతో రొప్పుతున్న ఆ పిచ్చిదాన్ని లేవనెత్తి యింటికి పిల్చుకొచ్చి, గాయాలకు మందు రాశాడు. అడుగంటిన ఆ పిల్ల కడుపుకింత అన్నం పెట్టించాడు.

అప్పట్నుండే... సరిగ్గా అప్పట్నుండే... విసిరికొట్టినా, కసిరికొట్టినా... చీమ కుట్టినట్టైనా ఫీలవక, కాళ్ళ కడ్డంపడి, ఆటో కడ్డంపడి, తన మూగ భాషలో, పిచ్చి సైగల్తో యేదో చెబుతూ, ఆటోలో కెక్కించమని, చేతిలో వున్నది పెట్టమని, అదే పనిగా, పెంపుడు పిల్లిలా వెంట తిరుగుతున్న దాని బారి కేగలేక అలాగే చేశాడు. ఆ పైన దాన్నాపటం అతడి తరం కాలేదు. విధిలేక కొన్నాళ్ళు, విసుగుతో కొన్నాళ్ళు, జాలితో మరికొన్నాళ్ళు, అలా చేసిన ఆ అలవాటు క్రమేపీ తెలీని యేదో అభిమానంగా రూపొందిందతడిలో.

ఎవ్వరో నవ్వుతారన్న బాధలేదు. విసుక్కుంటారన్న చింత లేదు. యెందుకంటే అవన్నీ యెప్పుడో అయిపోయాయి. లోకాన్ని గెలిచింది వెఱ్ఱిదాని అభిమానం. అన్నింటినీ అధిగమించి సృష్టిలోని ఆ అమాయక ప్రాణి అతడి దృష్టిలో కొచ్చింది.

ఆ పిచ్చిది... గౌన్లు తొడిగే వయసులో దిగంబరంగా, లంగాలు కట్టే ప్రాయంలో బొంది తెగి ముడేసుకున్న చిన్న చెడ్డీ ముక్కతో తెల్సు వెంకటేశుకు. పైట వేసే పరువంలో గజంపైనున్న అడ్డగుడ్డ వంటి ప్రస్తుతపు ఆచ్ఛాదనతో తెలుసు. అన్నింటికీ మించి ఆ పిచ్చిది అనాథగా కూడా తెల్సు. ఇలా యేదేదో దాని గురించి తెల్సిన వెంకటేశుకు దాన్ని కసురుకోవటం యిప్పుడు తెలీటం లేదు.

"ఇ..హ్హి...హ్హీ"

ఆటో చుట్టూ చప్పట్లు కొడ్తూ ప్రదక్షిణం చేస్తున్న పిచ్చిదాన్నాపి ఆటోలో కూర్చోబెట్టుకున్నాడు. ఓ నాల్గు రౌండ్లు అలా అలా త్రిప్పి పిల్లాడి కోసం కొన్న, దాని కోసమూ కొన్న నాల్గు చాక్లెట్లలో వో రెండు దాని చేతిలో వుంచి, స్వర్గంలోని రంభలా ఆనందంతో నాట్యం చేస్తున్న



ఆ పిచ్చిదాన్ని చూస్తూ తెలీని సంతృప్తితో వెనక్కు తిరిగాడు.

తనింటి కెదురుగా వున్న ఆ పెద్ద మేడింటి ముందు ఆటో ను ఆపి అద్దె డబ్బులా యజమాని చేతిలో పోసి, మెల్లగా తనింటి వేపడుగులు వేశాడు వెంకటేశు.

* * * *

ఆ రోజు....

వెంకటేశు మనసులో యేదో అసంతృప్తి.

ఎప్పుడూ అక్కడి కెదురొచ్చి మారాం చేసే పిచ్చి మంగి జాడలేదు.

చుట్టూ సునిశితంగా పరిశీలించాడు.

అల్లంత దూరాన... కూలిపోయిన పాత దేవాలయం గోడ కానుకుని, కాళ్లార జాపుకుని కూర్చున్న పిచ్చిది... చెదలు తిన్న పుస్తకంలా... చెదిరిన తిలకంలా... కన్పించిందతడి కళ్లకి.

గబ గబా ఆ వేపడుగులు వేశాడు వెంకటేశు.

చేతిలోని మిఠాయి పొట్లం తీసి దాని కందించాడు. అందుకోలేదు పిచ్చిది. తలటు తిప్పుకుని, పాతిన బండరాతిపై వొరిగి అటు తిరిగి పడుకుంది. నోట్లోంచి యేవో వింత వింత శబ్దాలు... అది యేడుపో, అయితే అది యెందుకో... కాకుంటే అది పిచ్చినవ్వో తెలీలేదు వెంకటేశుకి.

కొత్తగా, వింతగా కన్పిస్తున్న దాని వాలకం అతడి కంతు పట్టలేదు.

"పిచ్చివాళ్ల నర్థం చేసుకోవటం పిచ్చివాళ్లకే తరమేమో!" అనుకుంటూ నిట్టూరుస్తూ వెనుదిరిగా డక్కణ్ణుండి.

* * * * * *

ఆ మర్నాటి నుండీ మళ్లీ మామూలుగా కన్పిస్తున్న పిచ్చి మంగి మంచి వాలకం చూసి తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు వెంకటేశు.

పిచ్చితల్లి

మేడింటి ముందు పెట్టిన ఫలహారం... పూరింటి ముందు పోసిన గంజినీళ్లూ యేకం చేసుకుని, కలిమి లేముల్ని కలబోసుకు తింటున్న పిచ్చి మంగి చిల్లులుపడ్డ సిల్వరు గిన్నెలోంచి కారుతున్న ధారల్ని నాకుతూ తోకాడిస్తూ కూర్చున్న కుక్క పిల్లను కూడా కంపెనీకి కూర్చో బెట్టుకునే ఆ పిచ్చి మంగి నెప్పుడు చూసినా...

యే రంగుల సినిమాల్లోనూ... మరే కథల పుస్తకంలోనూ... యెంత గొప్ప వుపన్యాసం లోనూ విన్పించని, కన్పించని "సమ సమాజం..." "సహజమైన జీవిత సత్యం" యేదో తీలగా కళ్లక్కట్టినట్టన్పిస్తుంది వెంకటేశులో.

* * * * * *

ఒకరోజు....

పరీక్షగా చూశాడు వెంకటేశు.

మరోనాడు మరికాస్త కుతూహలంగా చూశాడు.

ఇంకో నాడు... ఇంకోనాడు...

అలా పరికిస్తూనే వింతగా విచిత్రంగా వింత చిత్రంగా చూశాడు వెంకటేశు.

ఆ చూసిన దృశ్యాన్నే నెమరేసుకుంటున్నాడు ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు. ఇంటి ముందున్న అరుగుపై పడుకుని బీడీముక్క కాల్చుకుంటూ అతడు.

గాజు గ్లాసుతో టీ తీసుకొచ్చి మొగుడి ముందుంచింది వెంకటేశు భార్య.

అప్పుడే అటుకేసి వచ్చింది పిచ్చి మంగి.

మళ్లీ చిత్ర- గా చూశాడు వెంకటేశు.

"ఇదిగో... ఇది విన్నావా?"

తల తిప్పి చూశాడు వెంకటేశు.

వెంకటేశు పెళ్లాం పిచ్చిదాని వేపే చూస్తోంది తదేకంగా.

"పాపం! ఈ పిచ్చిదాని కెవరో కడుపు చేశారు!"

వులిక్కి పడ్డాడు వెంకటేశు.

"నీవు చెప్పింది నిజమేనా?"

దిగ్గున లేచి కూర్చుంటూ విభ్రాంతిగా అడిగాడు.

"అవును! దాని కిప్పు డైదో నెల కావచ్చు. పసిబిడ్డ లాంటి దాన్నెవరు పాడు చేశారో... వాళ్ల కెట్లా మనసొప్పిందో... మాయదారి కాలం... కళ్ళులేని కామం!"

బాధగా అంది వెంకటేశు పెళ్లాం.

"భగవంతుడా!"

అంతకంటే మరే మన్లేక పోయాడు వెంకటేశు.

తన అనుమానం నిజమైంది. సందేహం లేదు... పిచ్చిది తల్లి కాబోతోంది... ఆడదాన్నన్న సంగతే మరచి ఆడుతూ పాడుతూ, పసిపాపలా, పిచ్చి లోకంలో తిరిగే యీ వెఱ్ఱిముండలో ఆడదాన్నెలా చూడగల్గారు? యెలా పైన చేయి వేయగల్గారు? అంతటి నికృష్టమైన కామానికే మగాడు వారసుడయ్యాడు!

ఈ పిచ్చిది....

స్త్రీ అనుకుంటే....,

స్త్రీని గౌరవించే సాంప్రదాయంలో పుట్టిన,

ఓ పసి బిడ్డనుకుంటే...,

ప్రేమించి లాలించే దయాగుణంలో పుట్టిన,

రాయో రప్పో ననుకుంటే...,

తప్పుకు పోయే మనస్తత్వంలో పుట్టిన మన స్వచ్ఛమైన మగవాడు... వో పిచ్చి దాన్నెలా పాడు చేశాడు? యెలా చేయగల్గాడు?

కాదు... కాదు... అది కాదిప్పుడు మన సాంప్రదాయం...

సారా పీపాల్లో, విదేశీ విస్కీల్లో అదిప్పుడు మునిగిపోయి, తల్లినే రమించాలని చూసే, చెల్లి పైనే చేయి వేయించే, కన్నకూతుర్నే కాటు వేసిన త్రాగుడు మైకంగా మారిపోయింది.

అంతటి మహత్తర శక్తివంతమైన ఆ మైకానికింక పిచ్చిదానిపై... అప్పరాలే వో పిచ్చిదానిపై ... ఓ అనాథపై అభిమానముంటుందా? తన పిచ్చిగాని! ఆనాడు ...పిచ్చిదాని వింత ప్రవర్తన తను గుర్తించలేకపోయాడు. విచక్షణ మరిచి, మనిషి మృగమై జరిపిన పశువాంఛా పైశాచిక చర్య ఫలితమని!

అప్పుడు మనిషి పట్ల తన నిర్వచనం మరోలా వుండేది!

లేచి రెండడుగులు వేశాడు వెంకటేశు. ఆ అడుగులు ముంగిట్లో నిల్చున్న పిచ్చి మంగి వేపుగా పడ్డాయి.

వారగా పట్టుకున్న దాని గిన్నెలో టీనీళ్ళు పోశాడు కంట్లో కారే కన్నీళ్లతో.



గటగటా త్రాగేసింది. కిలకిలా నవ్వేసింది.

"ఎవరు? ఎవరీ పని చేశారు?"

కడుపుపై చేయి వుంచుకుంటూ యెత్తుగా చూపెడ్తూ అడిగాడు వెంకటేశు.

నవ్వింది మంగి. గిన్నె తలపై బోర్లించుకుని నాట్యం చేయ నారంభించింది.

మళ్లీ... మళ్లీ అడిగాడు సైగల్తో తనకు తెల్సిన, ధానికర్థమవుతుందనుకున్న రీతిలో.

"వ్వె..వ్వె..వ్వె" వెక్కిరిస్తూ అక్కణ్ణుండి పారిపోయింది. తననుకున్నట్టే ఆశించిన నిజం తెలీలేదు. అనుకున్న ఆశాభంగమే యెదురైంది!

"పాపం!" మరోసారి బాధగా అన్నాడు వెంకటేశు

"వయసు తెలీని, వలపు తెలీని, స్త్రీత్వం తెలీని, మాతృత్వం తెలీని యీ వెఱ్ఱిది కూడా కన్నుగానని కామానికి సమిధ కావల్సి వచ్చిందా! పరిణామం యెలా పరిణమిస్తుందో గదా!"

కంట్లో వూరిన నీటితో యింట్లోకి నడిచాడతను.

★ ★ ★ ★

"పిచ్చి మంగికి రాత్రనగా మొదలైన నొప్పులు యీ రోజుకూ అట్లాగే వున్నాయి. దాని బాధ చూడలేక పోతున్నాను. యెవరూ పట్టించుకోవటం లేదు కూడా. కాన్పు కష్టమైనట్టుంది. చచ్చిపోతుందేమో! ఆ పాడుబడ్డ శివాలయం పక్కన పడుంది పాపం!" దిగులుగా అంది వెంకటేశు పెళ్లాం.

"అరె!"

తింటున్న ముద్ద జారిపడింది. వెంకటేశులో బాధ కదలాడింది.

ఆకల్తో మధ్యాహ్న భోజనాని కింటికొచ్చిన వెంకటేశులో ఆకలి చచ్చిపోయింది.

మరొకప్పుడైతే కోప్పడే వాడతను అన్నం ముందు పెట్టి సమస్యల్ని ముందు పెట్టే పెళ్లాన్ని.

కానప్పుడలా అన్లేకపోయాడు. పైగా మెచ్చుకున్నాడాలస్యంగా చెప్పనందుకు.

బట్ట లేసుకుని గబగబా బయటకొచ్చి ఆటో స్టార్టు చేశాడు.

శివాలయం ప్రక్కన ఆగింది ఆటో.

పిచ్చి పిచ్చి కూతల్తో....వెఱ్ఱి పెడబొబ్బల్తో, మాటరాని బాధతో అటూ యిటూ దొర్లుతోంది పిచ్చి మంగి.

అన్నెం పున్నెం ...సుఖం... దుఃఖం తెలీని అమాయకురాలికా యింతటి ప్రసవ వేదన? ఎవరి కర్మమవుతుందీ ప్రకృతి నివేదన?

కళ్లు రుమాలుతో వొత్తుకుంటూ అక్కడున్న వారిద్దరి సాయంతో ఆటోలో ఆ పిచ్చిదాన్ని పడుకోబెట్టుకున్నాడు.

"అర్జంటుగా హాస్పిటల్‌కు తీసుకెళ్లాలి. లేకుంటే నిన్నటి నుండే ప్రసవం కాని పిచ్చి మంగి చచ్చిపోతుంది. ఈ లోకపు నికృష్ట కామపు శాపానికి బలై పోతుంది. వొద్దు...వొద్దు... భగవాన్.. మంగి బ్రతకాలి. ఎవరికీ యే అపకారం చెయ్యని పిచ్చిది పిచ్చి ఆనందంతోనే బ్రతకాలి అన్యాయంగా చావకూడదు!"

ఆటో యాక్సిలేటర్‌పై బలంగా చేయి మోపబోయాడు.

ఇంతలో "వెంకటేశూ" అన్న కేక. వొక్క క్షణం ఆగాడు.

రొప్పుతూ సేఠ్ చమన్‌లాల్ గారి నౌఖరు ఆటోను సమీపించాడు

"అర్జంటుగా ఆటోతో యింటికి రమ్మన్నాడు సేఠ్‌జీ.. అదుగో గేటు కవతల నిల్చుని యిటే చూస్తున్నాడు పద..పద..!" తొందర చేశాడు నౌఖరు.

"ఎందుకు? యేమిటి? అని బాతాఖానీ పెట్టే టైం లేక ... తీలగా కన్పిస్తున్న యజమాని రూపాన్ని ధిక్కరించలేక ముందుకు కదిలాడు వెంకటేశు.

పిచ్చి మంగి పెడబొబ్బలతోనే ఆటో సేఠ్‌జీ యింటి ముందాగింది.

పులిలా ముందుకు దూసుకు వచ్చాడు చమన్‌లాల్.

"అర్జంట్ వెంకటేశూ ... అమ్మగారికి నొప్పులొస్తున్నాయట. ప్రొద్దుటే కారు రిపేరుకి వెళ్లింది. తక్షణం ఆటోలో బయల్దేరాలి!"

అంటూనే యింట్లోకి కేకేశాడు త్వరగా తెమలమని.

ఆటోలోంచి వికృతమైన అరుపులు మలుపు తిరగబోయిన ఆయన్నొక క్షణం వెనక్కు తిరిగేలా చేశాయి. అంతవరకూ గమనించని అతడు ఆటోలోకి చూశాడు.

కనుబొమ్మలు ముడివడ్డాయి. ముఖంలో రంగులు మారాయి.

"ఎవరది?"

అడిగాడు సేఠ్

జవాబు చెప్పలేదు వెంకటేశు.

సేఠ్ చండశాసనుడని తెల్సు తనకి. అయినా ఆపత్సమయంలో అవన్నీ ఆలోచించలేకపోయాడు.

పెదవి కదపలేదతను

"రోడ్లమ్మట తిరిగే ... యెవడితోనో తిరిగి, కడుపొచ్చిన ఆ ఎచ్చిది కదూ?"

గర్జించాడాయన.

అప్పటి ఆ పిచ్చిదాని అవతారం, దాని పిచ్చి అరుపులు సేఠ్‌జీకి పిచ్చెక్కించాయి.

అంతలో యిద్దరు ముగ్గురు పట్టుకుని సేఠ్‌గారి భార్యనాటో దగ్గరకు నడిపించుకొచ్చారు.

"ఊఁ దించెయ్ ఆ ముదనష్టపు ముష్టిదాన్ని!"

"సాబ్!" అంటూ అంతలోనే సేఠు ముఖంలోకి చూసే ధైర్యం లేక తలొంచుకునే....

"సేఠ్ సాబ్! కాన్పు కష్టమై అది చావు బతుకుల్లో వుంది. దాన్ని కూడా ఆస్పత్రికి తీసుకెళ్తానండీ అమ్మగారితో పాటే!"

అనలేక ... అనలేక ధైర్యం చేసి అన్నాడు చివరికి.

వువ్వెత్తున లేచాడు చమన్‌లాల్.

"షటప్! ఆ దరిద్రపు మండతో పాటు అమ్మగార్ని తీసుకెళ్తాననటానికి నీకెన్ని గుండెలు? ఆటో నద్దెకిచ్చింది నీకిందుకేనా? అపురూపంగా పెరిగిన అమ్మగారికీ దానికీ పోలికా? లేక లేక పుట్టబోతున్న మా బిడ్డకూ, ఆ నికృష్టపు, చండాలపు దాని బిడ్డకూ ముడిపెడ్తావా?"

"అదికాదండీ! వైద్యం అందక అది ఛస్తే ... ?

"ఛస్తే చావనీ! అది ఛస్తే యెవడిక్కావాలి? బ్రతికితే యెవడిక్కావాలి? దాని అసహ్యపు కాన్పు కాన్పిటలు కావాల్సి వచ్చిందా? దాని ప్రాణాలతో పనిబడే దెవడికి? బురదలో పంది నెవరు పట్టించుకుంటారు? దించెయ్ తక్షణం. మరొక్క

చిత్ర కళా పరిషత్ (విశాఖపట్నం) వారి 19వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన చిత్ర కళా ప్రదర్శనకి ప్రారంభోత్సవం చేసిన శ్రీ వి. అనంతరావు, సన్మానితులు శ్రీ పి. ఆర్. రాజు, పరిషత్ అధ్యక్షులు శ్రీ డి. సుందరరావు, గౌరవాధ్యక్షులు శ్రీ పి. వేణు గోపాలరెడ్డి, కార్యదర్శి శ్రీ అంట్యాకుల పైడి రాజుగార్లని చిత్రంలో చూడవచ్చు.



క్షణం అదిక్కడుంటే సహించేది లేదు!"

గర్జించాడు సేఠ్‌జీ నిలువెల్లా కోపంతో వణికిపోతూ. అతడినెంతో ప్రాధేయపడ్డాడు వెంకటేశు. లాభం లేకపోయింది.

"ఈడ్చేయండిరా యీ పాడు ముండని!"

పనివాళ్లంతా ఆ పిచ్చి మంగిని బర బర్రా యీడ్చుకెళ్లారు.

బాధతో రెప రెపలాడింది వెంకటేశు హృదయం.

ఆటో లోని సీటును శుభ్రం చేయించాడు సేఠ్. వెంకటేశుకైతే తుడవక ముందు సీటూ, తుడిచాక సీటూ ఒక్కలాగే కన్పించింది.

"ఊఁ స్టార్ట్ చెయ్!" భార్యను పొదివి పట్టుకుంటూ అన్నాడు సేఠ్.

యాంత్రికంగా ఆ పని చేశాడు వెంకటేశు. అతడి మనసంతా పిచ్చిదాని పైనే వుంది.

"తను తిరిగొచ్చేసరికది చచ్చిపోతుందేమో!"

బాధగా, భయంగా, నిస్సహాయంగా ఆటోని రోడ్డెక్కించాడు వెంకటేశు.

* * * * *

హాస్పిటల్‌లో అడ్మిట్ చేశారు సేఠ్ చమన్‌లాల్ భార్యను.

లేక లేక పుట్టబోయే ఆ సంతానంపై సేఠ్‌గారి యెన్నో కలలు దాగున్నాయి. ప్రేమించిన పెళ్లాం కోసం, పెళ్లాం కాన్పు కోసం డబ్బు మంచినీళ్లలా ఖర్చుపెడుతున్నాడు.

అవసరమైన, అనవసరమైన మందులకూ, మాకుకూ అన్నింటికీ హడావిడిగా తిరిగాడతడి బంట్లు ఆటో లో.

ఎన్ని పనులు నిర్వహిస్తున్నా వెంకటేశు మనసు పిచ్చిదానిపైనే వుంది.

తాను వెళ్లే దాకా దాని ప్రాణాలు నిల్పమని దేవుడికి మొక్కుకున్నాడు.

"ఇంక నువ్వెళ్లొచ్చు!"

చాలాసేపటికి సేఠ్‌జీ అనుమతిచ్చాడు.

క్షణం ఆలస్యం కాకుండా అఘ మేఘాల మీద ఆటో నడుపసాగాడు.

"తను వెళ్లే వరకు అది ప్రాణాల్తో వుంటే చాలు. హాస్పిటల్‌లో అడ్మిట్ చేయించొచ్చు!"

అనుకుంటూ పది నిముషాల్లో అక్కడికి చేరుకున్నాడు. ఆ చుట్టుపక్కలంతా కలయచూశాడు. యెక్కడా ఆ పిచ్చిదాని కేకలుగాని, అరుపులు గాని విన్పించలేదు.

"చచ్చిపోయిందేమో!"

పిచ్చివాడిలా అటూ యిటూ పరికించాడు. అక్కడికల్లంత దూరాన ... ఓ మొండి గోడల దాపున మట్టి పెళ్లల నడుమ, చెత్తా చెదారం పైన ... నేలతల్లి ఒడిలో, చల్లగాలి విసురులో సేద దీరుతున్న ఆ పిచ్చిది ... అప్పుడే వుద్భవించిన వో కొత్త సృష్టి, కేరు కేరుమని యేడుస్తూ ఆ పిచ్చిదాని చేతుల్లో ఆ తల్లీ బిడ్డలిద్దరూ ప్రకృతీమతల్లి వెచ్చని చేతుల్లో ...!

టపా టపా ఆనందాశ్రువులు రాలాయి వెంకటేశు కళ్లలో నుండి. సృష్టిలోని అందమేదో అతణ్ణి వివశుణ్ణి చేసిందో క్షణం.

అంతవరకూ అతడు పడ్డ ఆత్రం ... ఆవేదన ... ఆ క్షణంలో తొలగిపోయి, మనసు నిశ్చింతగా, నిశ్చలంగా అయిపోయింది. అలా యెంతసేపుండి పోయాడో వెంకటేశు.

మెల్లగా పిల్లాడితో సహా పిచ్చి మంగి నాటో లో వేసుకున్నాడు.

ఆనందంగా ఆటో స్టార్ట్ చేశాడు.

సేఠ్‌జీ యింటి ముందు మంత్రించినట్టుగా ఆగింది ఆటో.

ఆ మేడింటి ముందు ఆగిన టాక్సీలోంచి యేడుపులూ, పెడబొబ్బలూ ...

"ఏమైందండి?"

అడిగాడు ... ఆతృత నిండిన స్వరంతో.

గొల్లుమన్నాడు టాక్సీ దిగిన యజమాని.

"యెంతకీ కాన్పు కాక కష్టమైపోతే ... చివరకు ఆపరేషన్ చేసినా తల్లీ దక్కలేదు ... కడుపులో పోయిన పిల్లాడితో సహా తల్లీ పోయింది!"

అంటూ మరోసారి బావురుమన్నాడు సేఠ్‌జీ.

జపాన్ వారి సాంకేతిక పరిజ్ఞానపు సృష్టి

ఫిజి వి.ఐ.పి. ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టర్

'లైఫ్' టు-ఇన్-వన్ మోడల్-1985 (డాన్సింగ్ మేజిక్ లైట్‌తో బాటు)

రు.195/-కే పన్నులతో సహా

30 రోజులు ఉచితంగా వాడి చూసుకోవచ్చు.

ఇప్పుడు మా దగ్గర అందుబాటులో ఉన్నాయి.



ఆనందించడానికి ఒక ఉత్తమ మార్గం, ఇంటిలో లేదా ప్రయాణాలలో చక్కటి నేస్తం. పుట్టిన రోజు, పెళ్లి నిశ్చితార్థం, వివాహం, పండగల వంటి అనేక ఆనందదాయక సందర్భాలలో యిచ్చేందుకు అపూర్వమైన కానుక. ఇది మీ దగ్గర ఉంటే మీకు గర్వకారణం.

ఉచిత చేతి గడియారం చెయిన్ కానుకతో బాటు పార్సెల్ ద్వారా మీ చిరునామాకు పంపగలరు.

30 రోజుల లోగా ఆమోదించకపోతే, డబ్బు వాపసు చేస్తారు. మీ కోసం ఒకటి సమకూర్చుకోండి.

ALPS TRADERS (WAP)

21 Darya Ganj, P.B.7028, New Delhi-110002 Tel.

రు. 1,00,000 వరకు బహుమతులు

గెలవండి

Specimen Total : 18 ప్రవేశ రుసుము లేదు

5	4	9
10	6	2
3	8	7

మొదటి బహుమతి వెస్పా స్కూటర్, కలర్ టి. వి. టూ–ఇన్–ఒన్ కన్సలేషన్

6		
	7	
		8

బహుమతులు : అధునాతన జపాన్ మోడల్ సోనీ టూ–ఇన్–వన్ రు. **175/-** లకు పరస్పర ప్రయోజనం పథకం (చెయిన్ లింక్). పై తెలిపిన నమూనాలో 9 ఖాళీ గదులను పోస్టు కార్డు పై తయారు చేయండి. 3 నుండి 11 వరకు అంకెలను ఉపయోగించి పై గళ్లను నిలువుగా, అడ్డంగా, మూలలుగా ఎటు కూడినా 21 వచ్చేటట్లు నింపండి. ఒక అంకెను. ఒకసారి మాత్రమే ఉపయోగించవలెను. ఎంట్రీలు 15 రోజులలో పంపవలెను.

TELESTAR AGENCIES. (WAP)

Post Box No. 9421, DELHI-110051.

అంత బాధలోనూ కేర్ ... కేర్‌మంటున్న పసిబిడ్డ యేడ్పుతో ఆటోలోకి చూశాడాయన.

"ఎవరూ ... ముష్టిది .. పిచ్చిది కదూ? చాపలేదూ? పిల్లాడు పుట్టినట్టున్నాడే దానికి?"

"అవునండీ! రోడ్డు మీద పారేసిన దాన్ని దేవుడే కాపాడాడు. యే హాస్పిటల్, యే వాహనమూ యే డాక్టరూ ::: చివరికి యే డబ్బూ దానికక్కరర్లేక పోయింది. అది బ్రతికింది చిత్రంగా. అన్నీ వున్న అమ్మగారే పోయారు పిల్లాడితో సహా!"

కన్నీళ్లొత్తుకుంటూ అన్నాడు వెంకటేశు.

"అన్నీ వుంటే అమ్మగారెందుకు పోతారు వెంకటేశూ? యెన్ని వున్నా మాలో వొక్కటి లోపించింది. ఆ లోపం వల్లే యిలా జరిగింది!

వణికే స్వరంతో అన్నాడు సేఠ్ చమన్‌లాల్.

"అదేంటండీ!"

"అవును వెంకటేశూ ... బాధలో వున్న ప్రాణి ఆక్రందన వినలేక ఆ బాధకు అంతస్థుల తేడా నిర్మించాను. ప్రకృతిలోని ప్రాణికీ, ఆ ప్రాణి అద్వితీయ సృష్టికీ తారతమ్యాన్ని కల్పించాను డబ్బు మదంతో. ఆడదాని ప్రసవ వేదన కర్మాన్ని మార్చాను ఆర్థిక బలంతో.

మానవత్వాన్ని మర్చాను. అదే ... అదే ... నేనిక్కడ చేసిన లోపం. యెంత తొందర్లోనున్నా, అర్జంటుగా వాహనాన్ని సర్దుకున్నా, జేబులో నోట్లన్ని సర్దుకున్నా వొక్క మానవతను సర్దుకోలేక పోయాను. అదొక్కటుంటే అన్నీ వాటంతటవే సర్దుకుంటాయని గ్రహించలేక పోయాను. ఆ విషయం ఇప్పుడు ... యిక్కడ యిలా నిరూపించ బడ్డ నిజం. మహా సృష్టి ముందు నేనెంత? నా ఆస్తెంత? అంతస్తెంత?"

జేబులోని నోట్ల కట్టల్ని పిచ్చిగా నిర్జీవమైన భార్య శరీరంపై వెదజల్లుతూ విలపిస్తున్నాడు సేఠ్‌జీ.

ఆ మేడింటినీ, ఆ ఆస్తినీ, ఆ అంతస్తునూ దాటి ముందుకు కదిలింది వెంకటేశు ఆటో.

ఆ మేడలోని యేడ్పులు పిచ్చిదాని నవ్వుల్లో కలిసిపోయాయి.

★ ★ ★ ★

పిచ్చి మంగి నవ్వుతోంది కిలకిలా.

గదిలోకి తొంగి చూశాడు వెంకటేశు.

పాలతో పొంగులు వారే పిచ్చిదాని స్తన్యాన్ని బిడ్డ నోటి కందించింది వెంకటేశు పెళ్లాం.

అతడు చూసిన ఆ దృశ్యంలో సమస్త సృష్టి ప్రతిబింబించినట్టు తోచింది.

"పిచ్చి తల్లి బ్రతికింది. అవును! ఆమె పిచ్చిదైనా యిప్పుడో తల్లి. కన్ను గానని కామం కాలకూట విషం చిలికినా, అమృతంలా మోసిన, అనృతం కాని,



మరో సృష్టికి ప్రతీక. జగతిని లాలించే నిండైన మాతృక!"

"ప్రకృతే ప్రాణం పోసిన, పంచ భూతాలే పురుడు పోసిన ఆ అమాయకపు పిచ్చి తల్లికే అద్వితీయ శక్తి తోచ్తోంది?"

"అన్నీ వున్నా, యెన్నో తెలిసిన తెలివి మీరిన మనిషి మానవతను మరిచాడు... అన్ని హంగుల్తో, మహామహులైన డాక్టర్ల చేతుల్లో కూడా చావు నధిగమించలేక పోయాడు!"

మరోసారి పిచ్చి తల్లి వేపు చూశాడు.

"సమతా మమతల మహా సృష్టి ముందు మానవతను కోల్పోయిన నేనెంత? నా ధనమెంత? నా అహమెంత?"

పశ్చాత్తాపంతో విలపించే సేఠ్ చమన్‌లాల్ కంఠం మరోసారి చెవుల్లో ప్రతిధ్వనించగా...

దానికి తోడుగా పిచ్చి తల్లి నవ్వు గదంతా మారుమ్రోగింది. ఆ ధ్వని తరంగాలు ప్రణవ నాదాలై దిగంత కుడ్యాల్ని తాకాయి.